క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ప్యాట్ల హనుమాన్‌ ఆలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోండి శ్యామ్‌ మనోహర్‌, ప్రధాన కార్యదర్శిగా పుప్పాల సతీష్‌, కోశాధికారిగా బండారి నరేందర్‌, ఉపాధ్యక్షులుగా ద్యాగ శ్రీనివాస్‌, దోండి దేవేందర్‌, ధన్‌పాల్‌ విజయ్‌ కుమార్‌, కార్యదర్శులుగా కొటిక విజయ్‌ కుమార్‌, రుద్రవేణి అశోక్‌, పోల రాజు, ప్రచార కార్యదర్శిగా బోంపెల్లి శివ కుమార్‌ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా నగేశ్‌ శర్మ, పోల సుధాకర్‌ నియమితులయ్యారు.

అక్బర్‌నగర్‌ గ్రామ కాంగ్రెస్‌ కమిటీ ఎన్నిక



రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ గ్రామ కాంగ్రెస్‌ అధ్యక్ష, కార్యదర్శులను గురువారం మండల పార్టీ ఇన్‌చార్జి మేక వీర్రాజు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్‌ నూతన అధ్యక్షుడిగా ఎంవీకే సీతారామ రాజు, ప్రధాన కార్యదర్శిగా గోగినేని కృపారామ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్‌, చిక్కడపల్లి దువ్వ రవి, రాజావరప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో సత్తా చాటిన ఆర్మూర్‌ యువ కిశోరం



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ మాజీ చైర్‌ పర్సన్‌ పండిత్‌ వినీత చిన్న కుమారుడు పండిత్‌ ప్రజ్ఞాన్‌ చైన్నైలో నిర్వహించిన 50 ఓవర్ల క్రికెట్‌ లీగ్‌లో తన బ్యాటింగ్‌తో మెరుపులు మెరిపించి మ్యాన్‌ ఆఫ్‌ ది సీరిస్‌ అవార్డు సాధించాడు. వైజాగ్‌కు చెందిన కందకూరి క్రికెట్‌ అకాడమీ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. నాలుగు జట్లు పాల్గొన్న లీగ్‌ పోటీల్లో ప్రజ్ఞాన్‌ ఓపెనర్‌గా బరిలోకి దిగి 60, 17, 184, 53(నాటౌట్‌) రన్స్‌ సాధించాడు. నాలుగు మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు సాధించి జట్టు గెలుపునకు కృషి చేసిన ప్రజ్ఞాన్‌కు మ్యాన్‌ ఆఫ్‌ ది సిరీస్‌ ప్రకటించారు. తమ కుమారుడికి మ్యాన్‌ ఆఫ్‌ ది సిరీస్‌ రావడం పట్ల పండిత్‌ వినీత పవన్‌ దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

శంకుస్థాపన

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్‌ ఎదురుగా గురువారం విప్లవోద్యమ నేత, కార్మిక యోధుడు, అమరుడు డీవీ కృష్ణ స్మారక స్థూపం నిర్మాణం కోసం సీపీఐ (ఎంఎల్‌) మాస్‌లైన్‌ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ శంకుస్థాపన చేశారు. నాయకులు ప్రభాకర్‌, నరేందర్‌, దేవారం, రాజేశ్వర్‌, సాయగౌడ్‌, సుధాకర్‌ పాల్గొన్నారు.

నిరుపయోగంగా కల్యాణ మండపం

- పదేళ్లుగా ఒక్క పెళ్లి జరగని వైనం
- పట్టించుకోని దేవాదాయ శాఖాధికారులు



బాల్కొండలోని కల్యాణ మండపం

బాల్కొండ: మండల కేంద్రంలో నిర్మించిన తిరుమల తిరుపతి దేవ స్థానం కల్యాణ మండపం పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. కల్యాణ మండపం నిర్మాణం కోసం గ్రామస్తులు 1993 నుంచి 2013 వరకు నిరీక్షించారు. ఎట్టకేలకు కల్యాణ మండప నిర్మాణానికి 2012లో అప్పటి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. 2014 వరకు మండపం పనులను పూర్తి చేశారు. కల్యాణ మండపాన్ని అంగరంగ వైభవంగా అప్పటి ప్రభుత్వ విప్‌ ఈరవత్రి అనిల్‌ ప్రారంభించారు. ప్రారంభించి పదేళ్లు గడుస్తున్న ఇప్పటికీ పెళ్లిళ్లు లేవు.. పేరంటాలు లేవు. దీంతో కల్యాణ మండపం వృథాగా మారింది. బాల్కొండ మండల కేంద్రంలో టీటీడీ కల్యాణ మండపం ఉన్న విషయం కూడ మండల ప్రజలకు తెలియని వింత పరిస్థితి ఉంది. కల్యాణ మండపం వద్ద నీటి వసతి లేకపోవడంతో తొలి నాళ్లలో ఎవరు కూడా కార్యక్రమాలు నిర్వహించటానికి ముందుకు రాలేదు. తర్వాత కల్యాణ మండపాన్ని గురించి పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మరుగున పడిపోయింది. ఇలా దశాబ్ద కాలంగా నిరుపయోగంగా ఉంది. గ్రామస్తులు 20 ఏళ్లుగా కల్యాణ మండపం నిర్మాణం కోసం ప్రభుత్వాల చుట్టూ తిరిగారు. అంతే కాకుండా పది శాతం దేవాదాయ శాఖకు కంట్రిబ్యూషన్‌ కూడా చేశారు. కాని గ్రామస్తులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది.

నిబంధనలే కారణం..

టీటీడీ కల్యాణ మండపాలు నిరుపయోగంగా ఉండటానికి దేవాదాయ శాఖ పెడుతున్న నిబంధనలే కారణమని తెలుస్తోంది. ఆ శాఖ చర్యల వల్లే మూలన పడుతున్నాయనే విమర్శలున్నాయి. కల్యాణ మండపంలో ఏ కార్యం చేయాలన్నా అనేక నిబంధనాలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. అలానే సరైన సౌకర్యాలు లేకపోవడం ఇంకో కారణంగా తెలుపుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న కల్యాణ మండపానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలను కూడా సడలించాలని వేడుకుంటున్నారు. మండపం పర్యవేక్షణకు కూడ ఒక్క అధికారి లేడంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నాలుగు గ్యారంటీలు ఇప్పటికే నెరవేర్చాం

- కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌ కుమార్‌ రెడ్డి

పెర్కిట్‌(ఆర్మూర్‌): కాంగ్రెస్‌ పార్టీ అసెంబ్లీ ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో నాలుగు ఇప్పటికే నెరవేర్చామని, పార్లమెంటు ఎన్నికల తర్వాత మిగిలిన రెండు గ్యారంటీలను అమలు చేస్తామని ఆ పార్టీ ఆర్మూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌ కుమార్‌ రెడ్డి అన్నారు. ఆర్మూర్‌ మండలం అందాపూర్‌, మగ్గిడి, ఖానాపూర్‌లలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. లోక్‌ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఆర్మూర్‌ మండలం ఖానాపూర్‌ గ్రామానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు గురువారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ పెంబర్తి నరేష్‌, మాజీ ఎంపీటీసీ బాక మల్కన్న, మాజీ ఉప సర్పంచ్‌ ఉమ్మెడ నర్సయ్య, తదితరులు బీఆర్‌ఎస్‌ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. వినయ్‌ రెడ్డి కాంగ్రెస్‌ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రంథాలయ మాజీ చైర్మన్‌ మార చంద్రమోహన్‌, నేతలు యాళ్ల సాయా రెడ్డి, పోచన్న, ఎంపీపీ పస్క నర్సయ్య, కాంగ్రెస్‌ పార్టీ ఆర్మూర్‌ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు విట్టం జీవన్‌, తాజా మాజీ సర్పంచ్‌ మోహన్‌, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొద్దుటూరి వినయ్‌ రెడ్డి

అర్వింద్‌ మోసం చేశారు

ఆర్మూర్‌: ఐదు రోజుల్లో పసుపు బోర్డు సాధించకపోతే తన ఎంపీ పదవికి రాజీనామా చేసి రైతులతో కలిసి ఉద్యమంలో పాల్గొంటానని బాండ్‌ పేపర్‌ రాసి ఇచ్చి ఐదేళ్లుగా రైతులను మోసం చేస్తున్న అబద్ధాలకోరు నిజామాబాద్‌ పార్లమెంట్‌ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను ఓడించాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆరూర్‌ పట్టణంలోని సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా కార్యాలయంలోని కుమార్‌ నారాయణ భవన్‌లో గురువారం కమిటీ ప్రతినిధులు దేవరాం, మంథని గంగారాం, సుర్బిర్యాల లింగారెడ్డి కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతో ఎలాంటి స్పష్టత లేకుండా ఎన్నికల స్టంట్‌గా చేయించిన పసుపు బోర్డు ప్రకటనతో రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. నాయకులు ఏపీ గంగారాం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం డొంకేశ్వర్‌ మండలం జీజీ నడ్కుడ ఇండియన్‌ ఎల్పీజీ గోదాం వద్ద గ్రామస్తులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు 101కు ఫోన్‌ చేసి వెంటనే సమాచారం అందించాలన్నారు. అలాగే ఇంట్లో గ్యాస్‌ సిలిండర్‌ లీకై మంటలు ఏర్పడితే గోనే సంచిని నీటిలో తడిపి సిలిండర్‌పై వేయాలని, లేదంటే ఖాళీ బకెట్‌ను దానిపై ఏ విధంగా బోర్ల వేయాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. వ్యాపార సముదాయాలు, స్కూళ్లు, గోదాముల్లో అగ్ని ప్రమాదాలను నివారించే స్ప్రింకర్లు, స్మోక్‌ డిటెక్టర్‌ పరికరాలు కచ్చితంగా ఉంచుకోవాలన్నారు. వాహనాల్లో కూడా షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగితే వాటిని ఆర్పేందుకు రూ.150 విలువ చేసే స్ప్రేను కొనుగోలు చేసి పెట్టుకోవాలన్నారు. లీడింగ్‌ ఫైర్‌మెన్‌ మధుకర్‌, సిబ్బంది సుధాకర్‌, రాములు, మధు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారోత్సవాలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో అగ్నిమాపక శాఖ అధికారులు నిర్వహిస్తున్న వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం పట్టణంలోని భారత్‌గ్యాస్‌ ఏజెన్సీలో, షాపింగ్‌మాల్‌, వివిధ గోదాంలలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలను అందజేసి, వాల్‌ పోస్టర్లను అంటించారు.



వాల్‌పోస్టర్లతో అగ్నిమాపక శాఖాధికారులు

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ప్రారంభం



కందకుర్తి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రెంజల్‌(బోధన్‌): పార్లమెంట్‌ ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదల కావడంతో అధికారులు సరిహద్దుల్లో నిఘాను కట్టుదిట్టం చేశారు. రెంజల్‌ మండలం కందకుర్తి వద్ద గురువారం అంతర్రాష్ట్ర ఉమ్మడి చెక్‌పోస్టును అధికారులు ప్రారంభించారు. మహారాష్ట్ర నుంచి మద్యం, నగదు రాకుండా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా జల్లెడ పడుతున్నారు. తహసీల్దార్‌ ఖలీం, ఎస్సై సాయన్నలు చెక్‌పోస్టును సందర్శించి సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇందల్వాయి: ప్రజలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ సిబ్బంది సూచించారు. అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారం పలు గ్రామాల్లో కొనసాగాయి. ఈసందర్భంగా గన్నారం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది డిచ్‌పల్లిలోని శివం ఇండెన్‌ గ్యాస్‌ ఏజెన్సీ నిర్వాహకులకు అగ్ని ప్రమాదాలు, నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్యాస్‌ గోడౌన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగదారులకు ఇవ్వాల్సిన సూచనలను వివరించారు. అనంతరం కరపత్రాలను అందజేశారు.

యంత్రాలపై అందని రాయితీ

- రైతులకు భారంగా మారిన వ్యవసాయం
- పట్టించుకోని ప్రభుత్వం

పెర్కిట్‌(ఆర్మూర్‌): అన్ని రంగాల్లో మాదిరిగానే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికి వాటి ఫలితాలు క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. వ్యవసాయ రంగంలో వచ్చిన సాంకేతికత రైతులకు అందుబాటులో లేకుండా పోతోంది. వ్యవసాయ యంత్రాల ధరలు రైతులకు అందుబాటులో లేకపోవడంతో వచ్చిన సాంకేతిక విప్లవం ప్రయోజనం లేకుండా పోతోంది. గత ప్రభుత్వాలు యంత్రాలపై కొన్నేళ్ల పాటు రాయితీ కల్పించాయి. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తొలిసారి అధికారం చేపట్టగానే యంత్రలక్ష్మి పథకంతో యంత్రాలపై 50 శాతం రాయితీ కల్పించింది. అనంతరం రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత రాయితీ నిలిపేసింది. దీంతో రైతులు యంత్రాలను కొనుగోలు చేసే పరిస్థితి లేక కూలీలపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉత్పత్తి పెరిగే అవకాశం..

వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలలో యంత్రాల ప్రాధాన్యత అధికంగా ఉంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపట్టడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు పెరిగే అవకాశం ఉంటుంది. దుక్కి దున్నడానికి అవసరమయ్యే ట్రాక్టర్లు, కల్టివేటర్లు, కలుపు తీసే గొర్రులు, పంటలపై మందులు చల్లడానికి అవసరమయ్యే స్ప్రేయర్లు, తైవాన్‌ స్ప్రేయర్ల నుంచి చేతికొచ్చిన వరి పంటను కోయడానికి హార్వెస్టర్లు, పసుపు ఉడకబెట్టడానికి బాయిలర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నా ధరలు మాత్రం అందనంత దూరంలో ఉన్నాయి. దీంతో రైతులు కూలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గ్రామాల్లో వ్యవసాయ పనులకు కూలీలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వలస కూలీలపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. అందుబాటులో ఉన్న వారు కూలి పెంచడంతో రైతులపై భారం అధికమవుతోంది. ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇప్పటి వరకు వ్యవసాయ యంత్రాల రాయితీ విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు. యంత్రాలపై రాయితీ కల్పిస్తే రైతులకు పెట్టుబడి వ్యయాలు తగ్గి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.



బాయిలర్‌తో పసుపును ఉడకబెడుతున్న రైతులు

‘మోదీని మరోసారి ప్రధానిగా ఎన్నుకోండి’



తొండాకూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



కోటగిరిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): పార్లమెంట్‌ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి దేశ ప్రధానిగా మరోసారి నరేంద్ర మోదీని ఎన్నుకోవాలని బీజేపీ నాయకులు ప్రజలను కోరారు. గురువారం తొండాకూర్‌లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఊర చెరువు వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మారంపల్లి గంగాధర్‌, మండల బీజేపీ నాయకులు సురేందర్‌, గ్రామ నాయకులు గంగాధర్‌, నరేందర్‌, ముత్యం, తదితరులున్నారు.

కోటగిరిలో..

రుద్రూర్‌: కోటగిరి ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు బూత్‌ అధ్యక్షుల ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎత్తొండలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి విలాస్‌, యాద్‌గార్‌పూర్‌లో బూత్‌ కమిటీ అధ్యక్షుడు బోధన్‌ హన్మంతు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.

పొతంగల్‌ మండలం హెగ్డోలిలో మండల బీజేపీ అధ్యక్షుడు ప్రకాష్‌ పటేల్‌ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ తన పరిపాలన దక్షతతో ప్రతి ఒక్కరి గుండెల్లో చోటు సంపాదించుకున్నారని అన్నారు. జహీరాబాద్‌ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించి మోదీ నాయకత్వాన్ని బలపరచాలని ప్రజలను కోరారు.

సమాచారం..

నేడు కోటగిరిలో ఉచిత మెగా వైద్య శిబిరం

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం గ్రేస్‌ క్యాన్సర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కోటగిరి డైమండ్‌ అధ్యక్ష కార్యదర్శులు హనుమంతరావ్‌ పటేల్‌, కప్ప సంతోష్‌ , మాజీ అధ్యక్షులు టి. రవి కుమార్‌ తెలిపారు. మండల కేంద్రంలోని చావడిగల్లి చావిడి వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని వివరించారు.

చందూర్‌, వర్ని, కోటగిరి మండలాల్లో కాంగ్రెస్‌ పార్టీ సమావేశాలు

రుద్రూర్‌: బాన్సువాడ నియోజకవర్గంలోని చందూర్‌, వర్ని, కోటగిరి మండల కేంద్రాల్లో పార్లమెంట్‌ ఎన్నికల సన్నాహక సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఇందూర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం 11 గంటలకు చందూర్‌, మోస్రా కార్యకర్తలు, నాయకుల సమావేశం చందూర్‌ మండల కేంద్రంలోని సద్గురు ఫంక్షన్‌ హాల్‌లో ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వర్ని మండల కేంద్రంలోని సీసీడీలో వర్ని, రుద్రూర్‌ మండలాల కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు కోటగిరి మండల కేంద్రంలోని ఏఎస్‌ ఫంక్షన్‌ హాల్‌లో పోతంగల్‌, కోటగిరి మండలాలకు చెందిన కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు. జహీరాబాద్‌ ఎంపీ అభ్యర్థి సురేష్‌ షెట్కార్‌, బాన్సువాడ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి, తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా సమీపంలో గల ఖాందేష్‌ కాంప్లెక్స్‌ వద్ద రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్‌ శ్రీనివాస్‌ రిబ్బన్‌ కట్‌ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి తమ వంతు కృషి చేయాలనే సదుద్దేశంతో రక్ష స్వచ్ఛం సంస్థ సభ్యులం అందరం కలిసి ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్‌ పవార్‌, ఉపాధ్యక్షుడు జిందమ్‌ నరహరి, విద్యా గోపి, ఈట బేతు గంగాధర్‌, తులసి పట్వారి, ఖాందేష్‌ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్‌



పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌(ఆర్మూర్‌)

స్క్రీన్‌-1 –	హ్యాపీడేస్‌ – 01.30 పారిజాతపర్వం – 4.50, లవ్‌ యూ శంకర్‌ – 7.45, మార్కెట్‌ మహాలక్ష్మి – 10.25
స్క్రీన్‌-2 –	టిల్లు స్క్వేర్‌ (తెలుగు) – 12.00, 3.00, 06.00, 9.00
స్క్రీన్‌-3 –	ది ఫ్యామిలీ స్టార్‌ -12.10, 6.40 గీతాంజలి మళ్లీ వచ్చింది – 3.25, టినెంట్‌ (తెలుగు)- 10.05
స్క్రీన్‌-4 –	మంజుమ్మల్‌ బాయ్స్‌ (తెలుగు)- 12.45, 3.45, 6.45, 9.54

ఆధ్యాత్మికం

వైభవంగా రాముల వారి పట్టాభిషేకం



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని శక్కర్‌నగర్‌ కాలనీ రామాలయంలో రాముడి పట్టాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పట్టాభిషేక మహోత్సవంలో శక్కర్‌ నగర్‌ వాస్తవ్యులు రమాదేవి, రామ్మోహన్‌ రావ్‌ దంపతులు పాల్గొన్నారు. అన్నదానం చేశారు.

మోస్రాలో..



రుద్రూర్‌: మోస్రా మండల కేంద్రంలో సీతారామ చంద్ర స్వామి ఆలయంలో గురువారం శ్రీరాముని మహా సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాన్ని బ్రహ్మోత్తములు శ్రీనివాసచార్యులు, నవీన్‌ పంతులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రకు బాన్సువాడ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఎడపల్లిలో..



ఎడపల్లి(బోధన్‌): మండల కేంద్రంలోని శ్రీరామ మఠంలో గురువారం సీతారాముల కల్యాణం కనుల పండువగా కొనసాగింది. శ్రీరామ నవమి అనంతరం కల్యాణం నిర్వహించడం శ్రీరామ మఠంలో ఆనవాయితీగా కొనసాగుతోంది. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన రామనవమి ఉత్సవాలు..



బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్ల కోదండ రామాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలు గురువారం సీతారామ చంద్రుల చక్రస్నానంతో ముగిశాయి. పవిత్ర గోదావరికి ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం చేశారు.

ఉత్సవమూర్తులకు చక్రస్నానం

వేల్పూర్‌: పడగల్‌లో గురువారం ఉత్సవమూర్తులకు స్థానిక ఊరచెరువులో చక్రస్నానం నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా నాగవెల్లి, శేష హోమం, నిత్యపూజలు నిర్వహించి, ప్రధాన వీధులలో ఉత్సవమూర్తులను రథంలో ఊరేగించారు. స్థానిక రామాలయం వద్ద అన్నదానం చేశారు.



కొండగట్టుకు బయలుదేరిన స్వాములు



రుద్రూర్‌: చిక్కడపల్లి నుంచి ఎనిమిది మంది హన్మాన్‌ మాలధారణ స్వాములు గురువారం కొండ గట్టు పుణ్యక్షేత్రానికి కాలినడకన బయలుదేరారు. స్థానిక హన్మాన్‌ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రగా వెళ్లారు. పాదయాత్రగా వెళ్లిన వారిలో రాజు, గంగాధర్‌, సాయిలు, అంజి, శ్రీకాంత్‌, విష్ణు, సాయి ఉన్నారు. వీరికి రుద్రూర్‌ మండల కేంద్రంలో మాలధారణ స్వాములు స్వాగతం పలికారు. హన్మాన్‌ జయంతి నాటికి కొండగట్టు చేరుకుంటామని స్వాములు పేర్కొన్నారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పెర్కిట్‌(ఆర్మూర్‌): రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ సోకకుండా జాగ్రత్త పడాలని గోవిందపేట్‌ పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస సూచించారు. ఆర్మూర్‌ మండలం గోవింద్‌పేట్‌ వరి కల్లాల్లో పని చేస్తున్న రైతులకు గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ.. వడదెబ్బ సోకినపుడు తక్షణ వైద్య సహాయం అందజేయాలని సూచించారు. శరీరంలో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటిగ్రేడ్‌ కంటే అధికమైనపుడు వడదెబ్బకు గురైనట్లు నిర్ధారించుకోవాలన్నారు. శరీరం నుంచి చెమట రూపంలో నీరు వెళ్లడం వల్ల డీహైడ్రేషన్‌కు గురవుతారన్నారు. తిరిగి శక్తిని పొందడానికి ఓఆర్‌ఎస్‌ తాగాలని సూచించారు. మధ్యాహ్నం పూట అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే కాటన్‌ వస్త్రాలను ధరించి బయటకు రావాలన్నారు. ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్‌, ఫార్మసిస్టు లక్ష్మణ్‌, స్టాఫ్‌ నర్సులు కల్పన, తరంగిణి పాల్గొన్నారు.